# అందరి బతుకూ అందులోనే!

"హలో!"

పిలుపువిని వెనక్కి తిరిగిచూసింది అనూరాధ.

"ఏమిటా హడావిడి? నేనూ వస్తున్నాను." గబగబా వచ్చి ఆమెను కలుసుకున్నాడతను.

ఇద్దరూ నెమ్మదిగా నడుస్తున్నారు.

"మనిద్దరంకలసి సినీమాకువెళ్ళి చాలా కాలం అయింది!" కొన్ని అడుగుల తర్వాత అన్నాడతను.

బదులుచెప్పలేదు కానీ, ఓరకంట అతనివైపు చూసింది అనూరాధ....

చాలా రోజులక్రితం....

అతనితో తాను సినిమాకు వెళ్ళినప్పుడు, ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నప్పుడు, ఉండి ఉండి అతని భుజాలు తన భుజాల్ని తాకినప్పుడు, అతని చేతివేళ్ళు తన అరచేతిలో అర్థంకాని అక్షరాలు రాసినప్పుడు, తన నరాల్లో నెత్తురు గోరువెచ్చనయినప్పుడు అప్పుడు తెర మీద బొమ్మలు కనిపించనంత మైకమేదో కళ్ళల్లో నిండిపోయిన సంఘటన గుర్తుకొచ్చింది కాబోలు-ఇప్పుడు ఆమె చూసిన ఓరచూపులు సిగ్గుతో నిండివున్నాయి.

"అమరావతిలో మంచి ఇంగ్లీషుపిక్చరొచ్చింది.... రేపుచూద్దామా? ఆశగా అడిగాడతను మళ్ళీ.

"అమ్మో! అక్కడే మానాన్నగారి అఫీసు! మసంకసక ఆయనకంటపడితే ఇంకేవన్నా వుందా!"

"రేపు ఆదివారమేగా! మీ ఫాదర్‌కి ఆఫీసుండదు" సలహా ఇచ్చేడతను.

ఆలోచనలో పడింది అనూరాధ.

"ఇవాళే అడ్వాన్స్ బుకింగ్‌లో టిక్కెట్లు తీసుకుంటాను. రేపు మీ కాలనీ దగ్గర "బస్టాప్‌కి రెండయ్యేసరికల్లా" వస్తాను. ఆ సమయానికి నువ్వక్కడికీ వస్తే-ఇద్దరం ఆటోలో వెళ్ళిపోవచ్చు." ఉత్సాహంగా అన్నాడు.

"ఎలా? ఇంట్లో ఏం చెప్పాలి? ఆదివారం కాలేజీ వుండదు. పైగా వచ్చేనెలలోనే పరీక్షలు....ఇపుడు సినిమాకు అసలే పంపరు."

"పోనీ ప్రయివేటు క్లాసుకు పంపుతారుగా?"

„అంటే....?!" అర్ధం కాలేదు అనూరాధకు.

---

ఆలోచనలు గుర్నాధాన్ని అసహనపరుస్తున్నాయి....ఏ ఫైలు తీసినా అందులో-ఆటోరిక్షాలోంచి దిగుతున్న అనూరాధా ఆ అబ్బాయీ కనిపించసాగేరు. మనసులో తిరుగాడుతున్న కండచీమ అతన్ని ప్రశాంతంగా వుండనీయటంలేదు. ఫ్యాను తిరుగుతున్నా ముచ్చెమటలు

---

"ఏముందీ ? సింపుల్ ; ప్రయివేటు క్లాసుందని చెప్పివస్తేసరి"

"అమ్మో ! అబద్ధమని తెలిస్తే" ఖంగారుపడింది.

"లాభంలేదు....ఇంక నువ్ జీవితంలో సుఖపడలేవు ! అయినా చెప్పేవరకే భయం.... చెప్పేస్తే ఆ తర్వాత ఏభయమూ వుండదు. భయంవదిలేసి ఒక్క అబద్ధం నువ్ చెప్పగలిగితే-ఆతర్వాత వందల కొద్దీ అబద్ధాలు అవలీలగా చెప్పొచ్చు. అసలు ఎక్కడైతే ప్రేమ వుండునో అక్కడ అబద్ధంకూడా వుంటుందన్నాడు షేక్స్పియర్"

"నీతోనా ?" నవ్వేసింది అనూరాధ.... అతనూ నవ్వకలిపేడు.

అంతలో బస్స్టాప్ వచ్చేసింది.

"ఓ కె ! రేపు రెండున్నరకు మరచిపోవుగా !" హెచ్చరించి బస్ ఎక్కేశాడతను.

‡ ‡ ‡

మధ్యాహ్నం రెండున్నరకి, కృష్ణాహోటల్‌లో కాఫీతాగి-బయట కొచ్చి 'పాన్' కట్టించుకుంటున్న గుర్నాధానికి-కనుచూపుమేరలో— అమరావతి థియేటర్ దగ్గర ఆటో దిగుతున్న అనూరాధ కనిపించింది.

ఆశ్చర్యపోతూ మరికొన్నిక్షణాలు అవైపే చూసేడు.

ఆటోలోంచి అనూరాధ వెనకాల మరో అబ్బాయికూడా దిగేడు. పొడుగ్గా బలంగా అందంగా కనిపించేడు. కానీ తానెప్పుడూ అతన్ని చూడలేదు.

ఎవరో అతను....ఎవరయి ఉంటారు ?....

అనూరాధ ఎప్పుడూ-తనకు తెలిసినంతవరకూ-శ్యామలతో కలిసే సినిమాకు వెడుతుంది.... మరి ఇప్పుడు ఎవడో కుర్రాడితో వచ్చిం దేమిటి ?

పైగా ఇంగ్లీషు సినిమాకు.

చిన్నపాటి అనుమానం ఏదో కందచీమ గుర్నాథం మనసు చుట్టూ తిరగటం మొదలెట్టింది.

"ఇదిగో సార్ పాను !" కిళ్ళీకొట్టు అసామి పిలవటంతో గుర్నాథం ఆలోచనల్నీ - దృష్టిని మరల్చుకున్నాడు. గబగబా కిళ్ళీ తీసుకుని—అంతకంటే గబగబా దాన్ని నములుతూ-వడివడిగా ఆఫీసుకు చేరుకున్నాడు.

కుర్చీలో కూర్చున్నాడన్నమాటేగానీ ఏ పనీ చేయాలనిపించలేదు గుర్నాథానికి.

"అసలు ఆఫీసుకురాకపోయినా బాగుండిపోయేది" అనుకున్నాడు. ఆదివారం అయితే ప్రశాంతంగా వుంటుంది కనక-పెండింగ్ వర్క్-ఫినిష్ చేసుకోవచ్చునని-తీరుబడిగా భోంచేసి పన్నెండింటికి వచ్చేడు.

వస్తే వచ్చేను.... క్రిష్ణాహోటల్‌కి రాకుండా వుండాల్సింది !" అనుకున్నాడు మళ్ళీ.

ప్రతిదినం ఆఫీసుకి వచ్చేటప్పుడు శ్యామల టిఫిన్ తయారుచేసి ఇస్తూంటుంది....కాని ఆ దినం ఆలస్యంగా భోంచేయడంవల్ల తాను టిఫిన్ తెచ్చుకోలేదు.

ఆలోచనలు గుర్నాధాన్ని అసహనపరుస్తున్నాయి.... ఏ ఫైలు తీసినా అందులో-ఆటోరిక్షాలోంచి దిగుతున్న అనూరాధా ఆ అబ్బాయీ కనిపించసాగేరు. మనసులో తిరుగాడుతున్న కండచీమ అతన్ని ప్రశాంతంగా వుండనీయటంలేదు....పైన ఫ్యాను తిరుగుతున్నా-ముచ్చె మటలు పోస్తున్నాయి....

ఇక అక్కడ వుండలేక, ఫైల్సు కట్టకట్టిపారేసి-ఇంటికి చేరు కున్నాడు గుర్నాధం.

"ఎప్పటిలా ఇవేళకూడా ఆరయ్యేదాకా రారనుకున్నాను.... నయమే !.... పెంద్రాళే వచ్చేశారు....సినిమాకి వెడదామా ?" లోపలకు వచ్చి వాలుకుర్చీలో కూర్చున్న భర్తకి మంచినీళ్ళు అందిస్తూ అడిగింది శ్యామల....

అదేం వినిపించుకోలేదు గుర్నాధం.

"అమ్మాయేదీ ?" గడగడా నీళ్ళుతాగేసి అడిగేడు.

"కాలేజీకి వెళ్ళింది !" చెప్పింది శ్యామల.

గుర్నాధం మనసులో తిరుగుతున్న కండచీమ చిపుక్కు-మని కరచినట్లనిపించి-ఉలిక్కి-పడ్డాడు.

"ఇవేళ ఆదివారం !.... కాలేజీ ఏమిటీ?" తన ఉలికిపాటు కనిపించనీయకుండా సర్దుకుంటూ అడిగేడు,

"వాళ్ళ తెలుగు లెక్చరర్ ప్రయివేటుక్లాసు పెట్టేరట" బదులు చెప్పి వంటిట్లోకి వెళ్ళిపోయింది శ్యామల.

ఎవరేం చెప్పినా ఇట్టే నమ్మేస్తుంది శ్యామల. ఆ మాటకొస్తే తనూ నమ్ముతాడు.... కానీ ఆ చెప్పింది అబద్ధమని తర్వాత తెలిస్తే సహించలేడు. ఒంట్లో నెత్తురు ఉడికిపోయింది.

అయినా ఆవేశాన్ని తనలోనే దాచుకున్నాడు గుర్నాథం.

సాయంత్రం ఆరవుతూండగా అనూరాధ ఇంటికొచ్చింది....

"ఎక్కడికెళ్ళేవ్ ?"- ఆమె హాల్లోకి అడుగుపెట్టగానే అడిగాడు గుర్నాథం.

"ఇవాళ మా తెలుగు లెక్చరర్ ప్రయివేటు క్లాస్ పెట్టేరు నాన్నా! పరీక్షలు దగ్గరకొచ్చేశాయిగదా.... సిలబస్ ఇంకా పూర్తికాలేదు.... అందుకని...."

ఇంకా ఏదో చెప్పబోతున్న అనూరాధ చెంప చెళ్లుమనిపించేడు గుర్నాథం.

బిత్తరపోయి చూసింది అనూరాధ.

"అమరావతిలో మేట్నీ చూసొచ్చి–ప్రయివేటు క్లాసని అబద్ధం చెప్తావా ?" గుర్నాథం కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

దొరికిపోయాననుకుంది అనూరాధ....తప్పు ఒప్పుకుంటున్న దానిలా, తలవంచుకుని నేలచూపులు చూసింది.

"చూసేందుకు అక్కడేంలేదు!....నావైపు చూసి నిజం చెప్పు. నీతో సినిమాకి వచ్చినవాడెవడు ?" గద్దించేడు.

అనూరాధ చెప్పలేదు....భయంతో తండ్రివైపు చూసింది.

"మాట్లాడవే ?" మళ్ళీ చెయ్యెత్తబోయాడు.

"సర్వేశ్వర్రావని....మా క్లాస్‌మేట్....సరదాగా సినిమాకి వెడదాం రమ్మంటే వెళ్లాను అంతే....!" చెప్పింది అనూరాధ.

"ఓహో ! సరదాగా సినిమాకి రమ్మంటే వెళ్ళవన్నమాట !.... రేపెప్పుడో సరదాగా లాడ్జికి రమ్మంటాడు వెడతావా ?"గుర్నాథం కళ్ళల్లో నెత్తురు పేరుకుంటోంది....

అంతవరకూ వంటగది గుమ్మందగ్గర నిలబడి గమనిస్తున్న శ్యామల వాళ్ళ మధ్యకు వచ్చింది.

"చ...ఛ ! ఏమిటండీ ఆ మాటలు?... మీరే లేనిపోనివి దానికీ నేర్పిపెడుతున్నారు... సరదాగా వెళ్లానంటోందిగా !...ఇకముందు అలా వెళ్ళద్దని చెబితే సరిపోయేదానికి ఆ ఆవేశం ఎందుకు... దాన్ని కొట్టడం ఎందుకు ?..." అనూరాధను దగ్గరకు తీసుకుంది,

"కొట్టటంకాదు ! మరోసారి ఇలాంటి అబద్ధాలు చెప్పి, వెధవ్వేషాలు వేస్తే నరికి పోగులెడతాను". ఆవేశాన్ని అణచుకునే ప్రయత్నం చేశాడు గుర్నాథం.

‡ ‡ ‡

"నమస్కా-రం"- రూంలోకి అడుగుపెడుతూనే-నాలుగు కిలోల నవ్వులు ఒలకపోస్తూ వల్లమాలిన ఒయ్యారాలు చిలికిస్తూ ఒడుపుగా ఒంపుసొంపుల్ని ప్రదర్శిస్తూ చేతులు జోడించింది పంకజం.

"రా...కూచో ! నీకోసమే ఎదురుచూస్తున్నాను. అసలు నువ్వు వస్తావో రావో ననుకున్నాను". సగం కాలిన సిగరెట్టును యాష్ ట్రేలో నలిపేస్తూ అన్నాడు గుర్నాథం.

"అమ్మో!... మీరు ఫోన్ చేసి పిలవటమూ నేను రాకపోవటమూనా!... ఇంకేమన్నా వుందా?... అసలు నెలకొకసారైనా ఇలా మీ దగ్గర్నుంచి పిలుపు రాకపోతే నాకు పిచ్చెత్తిపోదూ?" అతని ప్రక్కన మంచంమీద కూర్చుంటూ అంది పంకజం.

ఆమె జడలో మల్లెపూలు గుప్పుమని— గుర్నాథం మనసుని గిలిగింతలు పెట్టేయి.

తట్టుకోలేకపోయాడు. క్షణం కూడా మరి ఆలస్యం చెయ్యకుండా అక్కడే టీపాయ్ మీదనున్న విస్కీ సీసా చేతిలోకి తీసుకున్నాడు. మూత తీసి, ఓ గ్లాసులో కొంచెం పోసేడు. రెండో గ్లాసులో కూడా కొంచెం పోయబోతుంటే పంకజం వారించింది.

"నాకొద్దు! వాసనవస్తే కష్టం...ఇంటిదగ్గర 'ఆయన' వున్నారు" గ్లాసు తీసి పక్కన పెట్టింది.

"ఏం! నైట్ డ్యూటీలు మానేశాడా?"

"సినిమాహాల్లో ఉద్యోగం చేసేవాడు నైట్ డ్యూటీలు మానేస్తే ఎలా?...జ్వరం వస్తోందని రెండ్రోజులు శలవుతీసుకున్నాడు... ఆ హాల్లో పాతసినిమా కనక శలవు దొరికింది!"

"మరైతే ఏంచెప్పి వచ్చావ్?" అడిగేడు గుర్నాథం మళ్ళీ.

"శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు-ఏదో ఒకటి చెప్పాలిగా!"

"అదే...ఏం చెప్పావని?"

"సర్కస్‌కి వెళ్ళొస్తానని చెప్పేను."

"నువ్ తిరిగి వెళ్ళేసరికి ఆలస్యమయితే?"

"మధ్యలో కరెంటు పోయిందంటాను !"

"అబద్ధాలు చెప్పేవాళ్ళంటే నాకు చిరాకు !" అన్నాడు గుర్నాధం గ్లాసులోకి నీళ్ళు వంపుకుంటూ.

ఆ మాట విని ఫెళ ఫెళా నవ్వేసింది పంకజం.

"ఎందుకా నవ్వ ?" అర్థంకాక అడిగేడు.

"ఎందుకా ?.... మీ అమాయకత్వానికి !.... నిజం చెబితే పనులు జరిగిపోతాయనుకుంటున్నారా ?.... 'మొగుడుగారూ, మొగుడు గారూ- ఫలానా కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్న గుర్నాధంగారు-కాలక్షేపానికి నన్ను లాడ్జికి రమ్మన్నారు— ఆయనతో 'కృష్ణారామా' అనుకుని ఓ గంటలో తిరిగి వచ్చేస్తానూ మీరు హాయిగా అన్నం తినేసి బుద్ధిగా నిద్రపొండీ" అని మా ఆయనతో చెబితే ఏమవుతుందో ఊహించండి !" అంది పంకజం.

ఏమవుతుందో ఊహించేటంత వ్యవధి తీసుకోకుండా వెంటనే అన్నాడు గుర్నాధం.

"ఏమో ! అబద్ధాన్ని నేను సహించలేను. నిన్న మా అమ్మాయి కూడా ఇలాగే ప్రయివేటు క్లాసుకి వెళ్ళాస్తానని చెప్పి బోయ్ ఫ్రెండుతో సినిమాకి వెళ్ళింది...దాని ఖర్మకొద్దీ అది నా కంటపడింది...నాలుగు చివాట్లేశాను. అయినా అప్పటినుంచి నా మనసంతా చికాకయి పోయింది. అందుకే ఇవాళ ఈ హోటల్లో రూమ్ బుక్ చేసి, నీకు కబురు పెట్టేను !"

"నిజమేమిటో తెలిసేదాకా ఎంతటి అబద్ధమైనా నిప్పులాగే బతుకుతుంది... అంతవరకూ ఎందుకూ ? ....ఇంట్లో నేను ఎన్నిసార్లు

అబద్ధాలు చెప్పి మీ దగ్గరకు రావటంలేదూ ?.... అవసరమైతే మీరు మాత్రం అబద్ధాలు చెప్పరా ?" సూటిగానే ప్రశ్నించింది పంకజం.

వెంటనే బదులు చెప్పలేదు గుర్నాధం...గ్లాసులో వున్న మందుతో ఓసారి గొంతు తడుపుకుని మరో సిగరెట్టు ముట్టించుకున్నాడు... ఆ తర్వాత మరికొంతసేపటికి పంకజం.. ఆ హోటల్ రూంలోంచి బయట కొచ్చి ఇంటికి ఆటో మాట్లాడుకుంది.

"ఇవాళ ఇంత ఆలస్యమైందే !" గదిలోకి వచ్చి బట్టలు మార్చు కుంటున్న గుర్నాధానికి మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ అడిగింది శ్యామల.

"ఎంతాలస్యమయిందీ ?" చికాకుపడ్డాడు గుర్నాధం.

"రోజూ ఆరయ్యేసరికి వచ్చేవారు... ఇవాళ పదకొండయినా రాకపోయేసరికి..." ఆగిపోయింది.

"ఊ !...ఆగిపోయావేం ?... అడుగు విసురుగా గ్లాసు అందు కున్నాడు.

"ఆఫీసులో పని ఎక్కువైందేమోననీ...."

"అవును ! ఆ మాట నిన్ననే చెప్పేను ! ప్రతిసారీ సంజాయిషీ యిచ్చుకోవాలా ? అంటూ తువ్వాలు భుజంమీద వేసుకుని విసురుగా బాత్‌రూం వైపు నడిచేడు గుర్నాధం !